క్లుప్తంగా

పెండ్లికుమార్తెకు ఆర్థికసాయం



పెండ్లికానుక అందుకుంటున్న వధువు

మక్కువ: మండలంలోని వెంకటభైరిపురం గ్రామానికి చెందిన పెండ్లికుమార్తెకు ఎం.ఎస్.ఆర్.ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మరడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. సర్పంచ్ ఎం.వెంకటరత్నం చేతులమీదుగా 10 వేల నగదు, చీర, సారెను అందించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో ఏ ఆడపిల్లకు పెళ్లయినా ఎం.ఎస్.ఆర్.ఫౌండేషన్ తమవంతు సాయం అందించి, ఆదుకుంటుండడం అభినందనీయమన్నారు.

చురుగ్గా బీటీ రోడ్ల నిర్మాణం



నిర్మాణ దశలో గాదెలవలస బీటీ రోడ్డు

సీతానగరం: మండలంలోని పలు ప్రాంతాల్లో బీటీ రోడ్ల నిర్మాణం చాలా చురుగ్గా జరుగుతోంది. ఆదివారం పలుచోట్ల నిర్మాణాలను పరిశీలించిన పీఆర్ ఏఈ చంద్రమౌళి మాట్లాడుతూ అనంతరాయుడుపేట నుంచి ఏగోటివలస–దయానిధిపురం గ్రామాల మీదుగా గాదలవలస వరకు రూ.కోటి చేపడుతున్న బీటీ రోడ్డు నిర్మాణంలో ప్రథమాంకం పనులు పూర్తయ్యాయన్నారు. కృష్ణారాయపురంలో అజ్జాడ బీటీ రోడ్డు జంక్షన్ నుంచి కృష్ణారాయపురం రెడ్డి వీధి వరకు మెటల్ రోడ్డు వేయడం పూర్తయిందన్నారు. దసరా తర్వాత పనులను మరింత వేగవంతం చేసి, పూర్తి చేస్తామన్నారు.

400 లీటర్ల సారా స్వాధీనం



స్వాధీనం చేసుకున్న సారా కేన్లతో ఎస్ఈబీ సిబ్బంది

పార్వతీపురంటౌన్: మండలంలోని రంగాలగూడ గ్రామంలో ఎస్ఈబీ సిబ్బంది ఆదివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, 400 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఇదే ఘటనకు సంబంధించి, కద్రక బంటి, పీడిక సోమన్న అనే ఇద్దరు వ్యక్తులను పట్టుకుని, అరెస్ట్ చేశారు. సదరు వ్యక్తులు ఒడిశా నుంచి రంగాలగూడకు కాలినడకన సారా తరలిస్తున్నారన్న సమాచారం అందుకున్న సిబ్బంది ఎస్ఈబీ సీఐ ఉపేంద్ర ఆధ్వర్యంలో గ్రామానికి చేరుకుని, తనిఖీలు నిర్వహించగా, వారు పట్టుబడ్డారు. తనిఖీల్లో ఎస్ఐ వి.వి.రమణ పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

రేగిడి: మండలంలోని బూరాడ గ్రామానికి చెందిన ఓ యువతి అదృశ్యంపై కేసు నమోదుచేశామని ఏఎస్సై మన్మథరావు ఆదివారం తెలిపారు. మూడు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకువెళ్లి ఇంత వరకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

కొత్తవలసలో బాణాల పండుగ

రాజాం: పట్టణ పరిధి కొత్తవలస గ్రామంలో జీఎంఆర్‌వీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం బాణాల పండుగ నిర్వహించారు. జీఎంఆర్ వీఎఫ్ ప్రతినిధి లావేటి రాజు ఆధ్వర్యంలో చిన్నారులు పూలబాణాలు పట్టుకుని ఇంటింటికీ వెళ్లి పువ్వులను బాణాలతో చల్లారు. పిల్లవారికి చాలు పప్పు బెల్లాలు.. శీఘ్రంగా పంపండి సీమంతులారా అంటూ జానపద పాటలు పాడారు. కార్యక్రమంలో డి.వాసుదేవరావు, వలంటీర్ మొయిల విజయలక్ష్మి పాల్గొన్నారు.

సాగునీరందించాలి

వంగర: తోటపల్లి కుడి ప్రధాన పాత కాలువ ద్వారా వంగర మండలంలోని శివారు గ్రామాలకు సాగునీరందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ కోరారు. మండలంలోని ఎం.సీతారాంపురం, శివ్వాం గ్రామాల్లో సాగుచేస్తున్న వరిపంటను ఆదివారం ఆయన పరిశీలించారు. నీరులేక పంటలు ఎండిపోతున్నాయని, అధికారులు సాగునీటిని సరఫరా చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఆయనతో పాటు పలువురు రైతులు ఉన్నారు.

ఆధ్యాత్మిక భావాలు తప్పనిసరి

బొబ్బిలి: ప్రజలు ఆధ్యాత్మిక భావాలు కలిగి ఉండాలని, బ్రహ్మకుమారీల ప్రవచనాలతో మంచిగా జీవించాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. ప్రజాపిత బ్రహ్మకుమారీల బొబ్బిలి బ్రాంచ్ ఇన్‌చార్జ్ రాజేశ్వరి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నవదుర్గల వేషధారణ నిర్వహించారు. ఈ ప్రదర్శనను ఎమ్మెల్యే శంబంగి తిలకించారు.

సంపద సృష్టి కేంద్రాలు నిర్మించుకోవాలి

రేగిడి: ప్రతీ పంచాయతీలో చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలను విధిగా నిర్మించుకోవాలని ఈఓపీఆర్డీ సూచించారు. మండలంలోని రేగిడి, ఆమదాలవలస, సంకిలి గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆదివారం పరిశీలించారు. గ్రామాల్లో ఇంటింటి నుంచి గ్రీన్ అంబాసిడర్లు సేకరిస్తున్న చెత్తను డంపింగ్ యార్డుకు తరలించి, వర్మీ కంపోస్టు తయారు చేసి రైతులకు విక్రయించడం ద్వారా పంచాయతీకి ఆదాయాన్ని చేకూర్చవచ్చన్నారు.

● దుర్గాదేవి నమోస్తుతే!



బలిజిపేట: అజ్జాడలో విజయదుర్గ ఆలయంలో పూజలందుకుంటున్న అమ్మవారు



సాలూరు: మహిషాసురమర్దిని అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్న కామాక్షమ్మ



సాలూరు: లక్ష్మీదేవి అవతారంలో జ్ఞానసరస్వతి అమ్మవారు



పార్వతీపురం పట్టణంలో దుర్గాదేవిగా కొలువైన నవదుర్గమ్మ



పార్వతీపురం టౌన్: పార్వతీపురంలోని వైకేఎం కాలనీలో భక్తుల పూజలు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అంతటా అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. రోజుకో అవతారంలో దర్శనమిచ్చే దుర్గాదేవి అమ్మవారిని చూసి, తరించేందుకు భక్తులు పోటీపడుతున్నారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి, అమ్మ అనుగ్రహం పొందేందుకు తహతహలాడుతున్నారు. దైవదర్శనానికి విచ్చేసే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. –సాక్షి నెట్‌వర్క్.



సాలూరు పట్టణంలోని కామాక్షమ్మ ఆలయంలో భక్తుల సామూహిక కుంకుమ పూజలు



సీతానగరం: లక్ష్మీపురంలో దుర్గాదేవికి పూజలు చేస్తున్న ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్



మక్కువ: చదురుగుడిలోని పోలమాంబ అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం చేస్తున్న భక్తులు



పార్వతీపురం టౌన్: లచ్చిరాజుపేటలో దుర్గాదేవి అవతారంలో అమ్మవారు



సాలూరు: మహాగౌరిగా భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

సభను జయప్రదం చేయాలి

● ఎమ్మెల్యే అలజంగి జోగారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించనున్న వైఎస్సార్ సీపీ భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. ఇదే విషయమై మండలంలోని అడ్డాపుశీల సచివాలయంలో ఆ సచివాలయం పరిధిలోని గ్రామీణ ప్రాంతాల నాయకులతో ఆదివారం సమావేశమైన ఆయన కాసేపు మాట్లాడారు. నవంబరు 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్న బీసీ సాధికారిత బస్సుయాత్ర పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచే మొదలుకానున్న నేపథ్యంలో ఆ యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ ఈ సభ నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కో–ఆర్డినేటరు వై.వి.సుబ్బారెడ్డి హాజరై, పార్టీ శ్రేణులను దిశానిర్దేశం చేయనున్నారన్నారు. సభకు నియోజకవర్గంలోని ప్రతీ గ్రామం నుంచి పెద్దఎత్తున పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలన్నారు. ఎమ్మెల్యే వెంట పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, వైస్ ఎంపీపీ బి.రవికుమార్ తదితరులు ఉన్నారు.

అంటిపేట సర్పంచ్‌గా తిరుపతిరావు



సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న తిరుపతిరావు

సీతానగరం: మండలంలోని అంటిపేట గ్రామ సచివాలయంలో సర్పంచ్‌గా బొంగు తిరుపతిరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు సర్పంచ్‌గా ఉన్న సిరికి మహేశ్వరరావు 1998 డీఎస్సీ ఉపాధ్యాయుల భర్తీలో ఉద్యోగం పొందిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆయన తన సర్పంచ్ పదవికి రాజీనామా చేయగా, ఉపసర్పంచ్‌గా ఉన్న తిరుపతిరావును సర్పంచ్‌గా నియమిస్తూ ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా కొత్త సర్పంచ్‌కు జెడ్పీటీసీ మామిడి బాబ్జి, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత శ్రీరాములునాయుడు తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి, అభినందనలు తెలిపారు. ప్రజాసేవే లక్ష్యంగా పనిచేసి మంచిపేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పి.శశిభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు నాణ్యమైన సేవలందించాలి



గ్యాస్ ఏజెన్సీని ప్రారంభిస్తున్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

రాజాం సిటీ: ప్రజలకు నాణ్యమైన సేవలందించినప్పుడే మంచి ఆదరణతో పాటు గుర్తింపు లభిస్తుందని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. మున్సిపాలిటీ పరిధి బుచ్చెంపేట సమీపంలో శ్రీవరహానరసింహస్వామి హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీని ఎమ్మెల్యే కంబాల జోగులు, శాసనమండలి విప్ పాలవలస విక్రాంత్‌లతో కలిసి ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీతో అందిస్తున్న ఉజ్వల స్కీంను సక్రమంగా అమలు చేయాలని ఏజెన్సీ యాజమాన్యానికి సూచించారు. వ్యాపార రంగంలో యువకులు ముందుకురావడం శుభపరిణామమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏజెన్సీ అధినేత కొండపర్తి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

టేకు మొక్కలు నరికేశారంటూ ఫిర్యాదు

మెంటాడ: మండలంలోని పణుకువానివలస రెవెన్యూ పరిధి సర్వేనెంబర్ 186–1లో గల ఐదు ఎకరాల భూమిలో పెంచుకున్న టేకు చెట్లను గుర్ల గ్రామానికి చెందిన కొంతమంది శనివారం అర్ధరాత్రి అక్రమంగా నరికేశారని పణుకువానివలస గ్రామానికి చెంది శిడగం సింహాచలం ఆదివారం డయల్ 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేసినట్లు ఆంధ్ర స్టేషన్ రైటర్ పైడితల్లి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వచ్చిన ఫోన్ కాల్ ఆధారంగా పొలానికి వెళ్లి చూడగా.. మొక్కలతో పాటు సింహాచలం ఉండే పాక కూడా కాలిపోయి ఉందన్నారు. విషయాన్ని సీఐ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు.

ద్రవ జీవామృతంతో తేమశాతం పెంపు

బాడంగి: ద్రవ జీవామృతం తేమశాతం పెంచేందుకు ఎంతో ఉపయోగపడుతుందని ఏపీసీఎఫ్ఎస్ఐ వై. ఈశ్వరరావు అన్నారు. మండలంలోని కోడూరు, బాడంగి గ్రామాలలో ఆదివారం పర్యటించి పాడిబారిన పొలాలను ఎలా సంరక్షించుకోవాలో వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వరి చేలు నీటిఎద్దడికి గురికాకుండా తేమ శాతం పెంచేందుకు ఈ ద్రవ జీవామృతం ఉపయోగపడుతుందని చెప్పారు. ఒక ఎకరాకు 180 లీటర్ల నీరు, 10 లీటర్ల ఆవుమూత్రం, 10 కిలోల ఆవుపేడ, 2 కిలోల బెల్లం, శనగపిండి, పుట్టమన్ను కలిపి జీవామృతం తయారు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీఆర్పీ వై.తులసి, వీఎస్ఏ పాప, వీఏఏ.జయలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం ఎంతో మేలు

తెర్లాం: ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవాటుగా చేసుకోవాలని స్థానిక శాఖా గ్రంథాలయం అధికారి సీహెచ్ కృష్ణమూర్తి అన్నారు. గ్రంథాలయంలో 'చదువంటే మాకిష్టం' అనే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పుస్తక పఠనం ద్వారా విద్యార్థులకు అవసరమైన విజ్ఞానం కలుగుతుందని చెప్పారు. అలాగే చిత్రలేఖనంపై ప్రతి విద్యార్థీ దృష్టి సారించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు వివిధ రకాల క్రీడాపోటీలు నిర్వహించారు.

పద్య రచనల్లో ప్రబంధం శిఖరాయమానం



సమావేశంలో మాట్లాడుతున్న రమణమూర్తి

రాజాం సిటీ: పద్యరచనల్లో ప్రబంధ శిఖరాయమానం శమంతకమణి అని ప్రముఖ సాహితీవేత్త ఒమ్మి రమణమూర్తి అన్నారు. కేంద్రసాహిత్య అకాడమీ భాషా సమ్మాన్ పురస్కార గ్రహీత బేతవోలు రామబ్రహ్మ రచించిన శమంతకమణి ప్రబంధం అధునాత భావాలతో కూడినదని ఆయన వివరించారు. ఆదివారం స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో రాజాం రచయితల వేదిక 105వ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన 'శమంతకమణి–బేతవోలు పద్యబాణి' అనే అంశంపై ప్రసంగించారు. భాగవతంలోని కొద్ది పద్యాల శమంతకమణి కథను అధునాతన భావాలతో, ఔచిత్యవంతమైన మార్పులతో, చక్కటి ప్రబంధంగా రాశారని అన్నారు. కార్యక్రమంలో వేదిక సభ్యులు గార రంగనాథం, పెంకి దయానిదినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి చేసి జైలుకెళ్తే సానుభూతి రాదు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



హాజరైన కౌన్సిలర్లు, గృహసారథులు, పార్టీ కార్యకర్తలు, నాయకులు

బొబ్బిలి: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సింపతీ కోసం పాకులాడుతున్నాడని... అవినీతి చేసి జైలుకెళ్తే సానుభూతి ఎందుకు వస్తుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ప్రశ్నించారు. ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 'ఏపీకి జగనే ఎందుకు కావాలి'పై సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ, జైల్లో ఉంటేనే ఎన్నికల సమయానికి తనకు సింపతీ వస్తుందని చంద్రబాబు భావిస్తున్నారన్నారు. వాస్తవానికి ఆయనకు సొంత పార్టీలోనే సింపతీలేదన్నారు. గత టీడీపీ హయాంలో ప్రజలకు ఎటువంటి సంక్షేమ పథకాలు అందనీయకుండా జన్మభూమి కమిటీలను నియమించి వారి ద్వారా కాసులు వసూలు చేసుకుని పబ్బం గడుపుకున్నారని ఆరోపించారు. నాలుగున్నరేళ్లలో ఎనలేని సంక్షేమ పథకాలు అమలు చేసిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, శంబంగి వేణుగోపాలనాయుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఇంటి గోపాలరావు, రాష్ట్ర ఆర్థిక మండలి మాజీ సభ్యుడు తూముల భాస్కరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్లు చెలికాని మురళి, రమాదేవి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హమీద్, జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జ్ రేజేటి ఈశ్వరరావు (విసు), బుడా చైర్‌పర్సన్ ఇంటి పార్వతి, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

నవంబర్ 1 నుంచి హామీల బేరీజు..

వచ్చే నెల 1 నుంచి గృహసారథులు, జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు, వార్డు ఇన్‌చార్జులు, ప్రజాప్రతినిధులు కలసి ఇంటింటికీ వెళ్లి గత ప్రభుత్వం ఇచ్చిన హామీ లు ఎన్ని? ఎన్ని అమలయ్యాయి.. ప్రస్తుత ప్రభు త్వం ఇచ్చిన హామీలెన్ని?.. ఎన్ని అమలయ్యాయి. మీ అభిప్రాయాలేంటన్న వివరాలను తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పట్టణ కమిటీ కార్యవర్గాన్ని పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్ నాయుడు ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా దమ్మా అప్పారావు, పోల అప్పారావు, ప్రధాన కార్యదర్శులుగా కింతలి శ్రీనివాసరావు, సుంకరపల్లి వాసంతి, సబ్బి రమణ ఎంపికయ్యారు.